సాక్షి తిరుపతి

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54.000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5.100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68.000
రిటైల్ వెండి గ్రాము	రూ.69

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	17
చిత్తూరు	34	17
తిరుమల	30	13
గూడూరు	34	19
నగరి	35	18



అ'భూత'కల్పన!

భూత వైద్యులు పేట్రేగిపోతున్నారు. అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అభూతకల్పనలు సృష్టిస్తున్నారు. గిట్టనివారు మంత్రాలు, చేతబడులు చేయిస్తున్నారని నమ్మబలుకుతున్నారు. – 10లో

న్యూస్‌రీల్

హైకోర్టు సెక్షన్ ఆఫీసర్‌గా చేతన్ దీపక్



తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని బంగారమ్మ కాలనీకి చెందిన ఏఎం రాధ, త్యాగరాజ్ కుమారుడు చేతన్ దీపక్ ఏపీ హైకోర్టు సెక్షన్ అధికారిగా ఎంపికయ్యారు. హైకోర్టు ఇటీవల నిర్వహించిన పరీక్షలో రాష్ట్రంలోనే తొలిస్థానంలో నిలిచి అనుకున్న లక్ష్యం సాధించారు. దీపక్ ప్రస్తుతం శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికైన దీపక్‌ను పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ సెక్రటరీ కె.ఆనంద్ బాబు తదితరులు అభినందించారు.

నేటి నుంచి పలు రైళ్ల రద్దు



వెంకటేశ్వరరావు

గూడూరు : విజయవాడ–గూడూరు మధ్య మూడో రైల్వే లైను నిర్మాణ పనుల నేపథ్యంలో సోమవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు పలు ప్యాసింజర్, మెమో రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు గూడూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బిట్రగుంట– చెన్నై, గూడూరు–విజయవాడ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశామన్నారు. అలాగే చెన్నై– నెల్లూరు మెమో రైళ్లను గూడూరు వరకే నడుపుతున్నట్లు వివరించారు.

1న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపును మార్చి 1వ తేదీన చేపట్టనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7గంటల నుంచి హుండీ లెక్కింపును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

తిరుపతి కల్చరల్: ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.పరమశివన్ తెలిపారు. ఆదివారం తిరుపతి అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, రామచంద్రయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరించారన్నారు. సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఎం.త్యాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.భూపాల్, కోశాధికారిగా డాక్టర్ ఇ.గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంబేడ్కర్ స్టార్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు ఎం.ప్రసాద్‌రావు, ఆనందరావు, మణి, జయరాం, ఎస్.సుబ్రమణ్యం, రఘురాములు, రెడెప్ప, వాసు, బాబు, ధనంజయులు, చరణ్, ద్వారక, అంబేడ్కర్ భవన్ కమిటీ సభ్యులు చిరంజీవి, ఇంద్రముని, సమతా సైనిక్ దళ్ రెడ్డెప్ప, సుధాకర్, పవన్, గాలి రవి, దీప్, రామ్మూర్తి పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం.. చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న అర్చకులు

రేణిగుంట : మండలంలోని గాజులమండ్యంలో వెలసిన కామాక్షి సమేత మూలస్థానేశ్వరాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేసి విశేషంగా అలంకరించారు. లోకకల్యాణార్థం యాగం జరిపించినట్లు వేదపండితులు మోహనశర్మ, దక్షిణామూర్తి తెలిపారు. యాగపూజల్లో ఎస్ఆర్ఐ జువ్వల మోహన్‌రామిరెడ్డి, డాక్టర్ కృష్ణప్రశాంతి, హరినాథరెడ్డి దంపతులు, ఆలయ నిర్వాహకులు జువ్వల ధనంజయరెడ్డి, సర్పంచ్ గంగారి రమేష్, సుమతిరెడ్డి పాల్గొన్నారు.

గో విందుని వర ప్రసాదం.. ఆధారిత వ్యవసాయం





టీటీడీ గోశాల నుంచి మంత్రి పెద్దిరెడ్డి చేతులమీదుగా గోవులు స్వీకరిస్తున్న రైతులు (ఫైల్)



చిన్నగొట్టిగల్లు మండలం బిల్లావాండ్లపల్లెలో గోఆధారిత వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన పంటను చూపుతున్న రైతు

ఆధునిక సమాజంలో ప్రజలు ఆరోగ్యకర ఆహారానికి దూరమవుతున్నారు. రసాయనాలతో విషతుల్యంగా మారిన పదార్థాలను భుజిస్తూ ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో సేంద్రియ సేద్యంతో ఒనగూరే ప్రయోజనాలను ప్రభుత్వం గుర్తించింది. భావితరాలను భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ పద్ధతుల్లో పంటల సాగును ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ప్రకృతి వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు టీటీడీ సంకల్పించింది. గో ఆధారిత సేద్యంతో పండించిన పంటలనే శ్రీవారి నిత్య కైంకర్యాలు, అన్నప్రసాదాల్లో వినియోగించాలని నిర్ణయించింది. ఈ దిశగా రైతులను నడిపించేందుకు టీటీడీనే గోవులు, ఎద్దులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. గోమూత్రం, పేడతో ఎరువులు సిద్ధం చేసుకునేందుకు సహకారం అందిస్తోంది. తద్వారా గో ఆధారిత వ్యవసాయానికి పునరుజ్జీవం పోస్తోంది.

- సేంద్రియ వ్యవసాయానికి టీటీడీ ప్రోత్సాహం
- రైతులకు ఉచితంగా ఆవులు, ఎద్దుల పంపిణీ
- లబ్ధిదారుల ఎంపికకు రైతు సాధికార సంస్థ..
- పంట ఉత్పత్తుల కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌తో ఒప్పందం

యెండ్లూరి మోహన్ – సాక్షి తిరుపతి డెస్క్

సమస్త మానవాళికి రసాయనాలతో ముప్పు పొంచి ఉందని టీటీడీ గుర్తించింది. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతుల దృష్టి మళ్లించాలని యోచన చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీటీడీ గోశాలలతో పాటు, ఇతర గోశాలల ద్వారా రైతులకు గోవులు, ఎద్దులను అందించి, గోమూత్రం, పేడతో పంటలు సాగు చేసుకునేలా చర్యలు చేపట్టింది. ఈ తరహా వ్యవసాయం చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి వివరించింది. రైతులు పండించిన సేంద్రియ పంటలను కొనుగోలు చేస్తూ, క్రమేణా అన్ని దేవాలయాలు, హోటళ్లు, సంస్థలను చైతన్యవంతం చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది.

నోడల్ గోశాలల సమన్వయంతో..

గ్రామీణ ప్రాంతాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్న రైతులకు టీటీడీ చేదోడుగా నిలుస్తోంది. గోవులు, ఎద్దుల పంపిణీలో రాష్ట్రంలోని నోడల్ గోశాలలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోంది. అందులో భాగంగా 27 గోశాలలను గుర్తించింది. గో ఆధారిత వ్యవసాయంపై మక్కువ చూపుతున్న 1,498 మంది రైతులకు 872 కోడె గిత్తలు, ఎద్దులు, 1,196 ఆవులు మొత్తం 2,068 గోవులను ఇప్పటికే అందించింది.

గోవులు పొందడం ఇలా..

టీటీడీ నుంచి గోవులు పొందాలనుకునే రైతులు ముందుగా సేంద్రియ సేద్యం చేస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ కార్యకర్త నుంచి గుర్తింపు తీసుకోవాలి. గ్రామంలోని రైతు సంఘంలో తీర్మానం చేయించాలి. ఆర్బీకేలోని వీఏఏవీహెచ్ఏ నుంచి డిక్లరేషన్ తీసుకోవాలి. అనంతరం రూ.10 స్టాంపు పేపర్‌పై గోవును జాగ్రత్తగా చూసుకుంటామని అంగీకార పత్రం ఇవ్వాలి. మొత్తం ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతులు తమకు కావాల్సిన ఆవు, ఎద్దులను ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తారు. గోశాలనుంచి రైతు ఇంటికి గోవులను తీసుకెళ్లేందుకు రవాణా కోసం ఉచితంగా సమకూర్చిన వాహనాల్లో సురక్షితంగా రైతు ఇంటికి చేరుస్తుంది.

రైతు సాధికార సంస్థతో ఒప్పందం

టీటీడీ నేరుగా రైతుల నుంచి ఉత్పత్తులను సేకరించడం కష్టం. అందుకే రాష్ట్ర రైతు సాధికారిక సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖల సహకారం తీసుకుంది. 2021, అక్టోబరు 12వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో ఒప్పందం చేసుకుంది. అప్పటి నుంచి మార్క్‌ఫెడ్ యంత్రాంగం ఎప్పటికప్పుడు రైతులను నుంచి గో ఆధారిత పంట ఉత్పత్తులు సేకరించి టీటీడీకి సరఫరా చేస్తోంది.



సేంద్రియ విధానంలో సాగుచేసిన పంటను పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్

సేకరణ ఇలా..

రైతు భరోసా కేంద్రానికి వచ్చిన పంట ఉత్పత్తులను రైతు సాధికార సంస్థ పరీక్షించి రసాయన రహితంగా గుర్తిస్తుంది. అనంతరం మార్క్‌ఫెడ్ ఆయా పంటలను కొనుగోలు చేస్తోంది. రైతుల ఖాతాలకు పదిరోజుల్లో సొమ్ము జమ చేస్తుంది. సేకరించిన పంటలను కోల్డ్ స్టోరేజీలో భద్రపరుస్తుంది. టీటీడీ అవసరాలకు తగ్గట్టు ఎప్పటికప్పుడు సరఫరా చేస్తుంది.

ప్రధానంగా కొనుగోలు చేసే ఉత్పత్తులు

సేంద్రియ పద్ధతిలో పండించిన పంటల్లో టీటీడీ ప్రధానంగా బియ్యం, శనగపప్పు, కందిపప్పు, బ్లాక్ గ్రామ్, పెసరపప్పు, చింతపండు, పసుపు, వేరుశనగ, బెల్లం, మస్టర్ సీడ్స్, బ్లాక్ పెప్పర్, కొరియాండర్‌ను కొనుగోలు చేస్తోంది

నైవేద్యం.. నిత్య కైంకర్యాలు

2021 మే1వ తేదీ నుంచి శ్రీవారికి గో ఆధారిత ఉత్పత్తులతోనే నైవేద్యం, నిత్య కైంకర్యాలు సమర్పిస్తున్నారు. అన్నప్రసాదాలు, స్వామి ప్రసాదం, లడ్డూ ప్రసాదాల తయారీలోనూ వినియోగిస్తున్నారు.

సిద్ధంగా 25 వేల మెట్రిక్ టన్నులు

గో ఆధారిత వ్యవసాయం చేసిన రైతుల నుంచి టీటీడీకి అవసరమైన 12 రకాలు ఉత్పత్తులను మార్క్ ఫెడ్ ఇప్పటికే సిద్ధం చేసి ఉంచింది. 24,500 మంది రైతుల నుంచి 25వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను సేకరించింది. ఈ మేరకు ధరల పట్టికకు అనుమతి కోరుతూ టీటీడీకి ప్రతిపాదనలు పంపింది. 2022లో 600మంది రైతులు 1,505 మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులనే టీటీడీకి సరఫరా చేయగా, ఈ ఏడాది రైతుల్లో అవగాహన పెరగడంతో గో ఆధారిత ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి.

ఆరోగ్యకర సమాజమే లక్ష్యం



రసాయన ఎరువులు, పురుగు మందులతో పండిస్తున్న పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుని ప్రజలు క్యాన్సర్ లాంటి అనేక రోగాలకు గురవుతున్నారు. ప్రపంచాన్ని ఈ సమస్య నుంచి కాపాడడానికి రైతులు గో ఆధారిత వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి. ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యంగా టీటీడీ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. టీటీడీ కోసం రైతు సాధికార సంస్థ ఎంపిక చేసిన రైతులు భక్తి శ్రద్ధలతో పంటలు పండించాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ రసాయన ఎరువులు వినియోగించవద్దు. టీటీడీ స్ఫూర్తితో ఇతర ఆలయాలు కూడా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో అన్నప్రసాదాలు తయారుచేసేందుకు ముందుకు వస్తున్నాయి. గోఆధారిత వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకురావాలి.

– ఏవీ ధర్మారెడ్డి, ఈఓ, టీటీడీ

భూమి సారవంతం



రెండేళ్ల క్రితం టీటీడీ నుంచి నాటు ఆవును తీసుకున్నాం. 1.5 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. రసాయన ఎరువులు వాడకుండా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేసుకుని వినియోగిస్తున్నాం. దీంతో భూమి సారవంతంగా మారింది. అలాగే ఊర్లోని మరో 10 మంది రైతులు మా వద్ద నుంచి ఆవు పేడ, గోమూత్రం తీసుకుని వెళ్లి జీవామృతం తయారుచేసుకుంటున్నారు. ఆవు రోజూ 3 లీటర్ల పాలు కూడా ఇస్తోంది.

– జి.లక్ష్మీదేవి, రైతు, బిల్లావాండ్లపల్లె, చిన్నగొట్టిగల్లు మండలం

రైతులు అదృష్టంగా భావిస్తున్నారు



గోఆధారిత వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్‌లో కంటే టీటీడీ అధికంగా చెల్లిస్తోంది. ఉదాహరణకు ప్రకృతి వ్యవసా యం ద్వారా పండించిన శెనగలకు బయటి మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.4,400 నుంచి రూ.4,600 వరకు ధర లభిస్తుండగా టీటీడీ రూ.5,700లకు కొనుగోలు చేసేంది. దీంతో రైతుకు ఆదాయంగా ఉంది. మరోవైపు సాగుచేసేందుకు ఖర్చుకూడా తగ్గుతోంది. ఇదిలా ఉంటే తాము పండించిన పంటను దేవుని ప్రసాదంగా తయారుచేస్తుండడంతో రైతులు అదృష్టంగా భావిస్తున్నారు. తిరుమలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని మరో 11 ప్రధాన ఆలయాలు కూడా రైతులనుంచి గోఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చాయి.

– టి.విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు
- పోలింగ్ కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశం
- క్షేత్రస్థాయిలో పకడ్బందీ పరిశీలన
- నేడు నామినేషన్ల ఉపసంహరణ.. మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది జాబితా

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణన్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్‌తో పాటు పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారులు ఎస్‌హెచ్. కాటమనేని భాస్కర్, కోనా శశిధర్, శ్రీధర్ పకడ్బందీ ఎన్నికలకు తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే నామినేషన్లు, స్క్రూట్నీ పూర్తి చేశారు. మరోవైపు ఆరు జిల్లాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ప్రకటించారు. పట్టభద్రుల నియోజకవర్గానికి 6 జిల్లాల పరిధిలో మొత్తం ఓటర్లు 3,81,181 మంది ఉన్నారు. అందులో పురుషులు 2,45,866 మంది , మహిళలు 1,35,284, ఇతరులు–31 మంది ఉన్నారు. మొత్తం 320 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహిం చనున్నారు. ఉపాధ్యాయుల స్థానం ఎన్నికలకు 6 జిల్లాలో పరిధిలో మొత్తం ఓటర్లు 27,694 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 16,825 మంది, మహిళలు–10,869 మంది ఉన్నారు. మొత్తం 175 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆరు జిల్లాల పరిధిలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతోపాటు రెవెన్యూ, అనుబంధ సిబ్బందిని ఈ ఎన్నికల విధుల్లో ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎక్కడిక్కడ పోలీస్ స్టేషన్ పరిధి అధికారి నుంచి జిల్లా ఎస్పీ స్థాయి వరకు బందోబస్తుపై ఆదేశాలిచ్చారు.

జిల్లాల వారీగా యూనిట్లు

ఎన్నికల నిర్వహణలో జిల్లాల వారీగా యూనిట్లు విభజించి అందరినీ సమన్వయ పరుచుకునేలా రిటర్నింగ్ అధికారులతోపాటు ఎన్నికల పరిశీలకులు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయడంలో నిమగ్నమయ్యారు. రిటర్నింగ్ అధికారులతోపాటు ఎన్నికల పరిశీలలకు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనపై క్షేత్రస్థాయిలో రిటర్నింగ్ అధికారి హరినారా యణన్‌తోపాటు పరిశీలకులు కాటమనేని భాస్కర్ పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

బరిలో ఎందరో తేలేది నేడే

నామినేషన్ల స్క్రూట్నీ తర్వాత పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 23 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 8 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఈ రెండు స్థానాలకు ఎన్నికల బరిలో నిలిచే తుది అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం 3 గంటల తర్వాత అధికారులు వెల్లడిస్తారు.

శాస్త్రోక్తం.. శాంతి అభిషేకం



స్వామి అమ్మవార్లకు హారతి సమర్పిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ఏకాంత సేవలో ముగిశాయి. ఈ క్రమంలో ఆదివారం పంచమూర్తులు, పరివార దేవతలకు శాస్త్రోక్తంగా శాంతి అభిషేకం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబతో పాటు వినాయకస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప, త్రిశూలం, పరివార దేవతల ఉత్సవమూర్తులకు వివిధ అభిషేకాలను వేదపండితులు జరిపించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

దిశానిర్దేశం



"పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన అభ్యర్థులను గెలిపించుకోవాలి. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధించేందుకు సమష్టిగా పనిచేయాలి. నియోజకవర్గాల వారీగా ప్రతి ఓటూ పోలయ్యేలా ప్రజాప్రతినిధులు పటిష్టంగా చర్యలు చేపట్టాలి. ఉదాసీనత లేకుండా అప్రమత్తంగా ఉంటూ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి" అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలకు ఆదివారం తిరుపతిలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని, మంత్రి పెద్దిరెడ్డి దిశానిర్దేశం చేశారు. – సాక్షి తిరుపతి

లోకేష్ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసన

తిరుపతి మంగళం : ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిపై లోకేష్ చేసిన వ్యాఖ్యలపై నిరసన వెల్లువెత్తింది. ఆదివారం ఈ మేరకు లోకేష్ టెంట్ వద్ద నోటికి రిబ్బన్లు కట్టుకుని జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకేష్ వాకింగ్ చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని, ఎమ్మెల్యే భూమనపై అనుచిత వ్యాఖలు, అసత్య ఆరోపణలు చేస్తే సహించమని స్పష్టం చేశారు. తిరుపతి నగర అభివృద్ధిపై మాట్లాడే అర్హత టీడీపీ నేతలకు లేదన్నారు. 14ఏళ్ల టీడీపీ పాలనతో చిన్నపాటి రోడ్లు, కాలువలు కూడా నిర్మించలేదని విమర్శించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే భూమన ఆధ్వర్యంలో తిరుపతిలో అభివృద్ధి పరుగులు తీస్తోందని, మాస్టర్‌ప్లాన్ రోడ్లతో నగర రూపురేఖలు అద్భుతంగా మారుతున్నాయని తెలిపారు. లోకేష్ తమ వెంట వస్తే తిరుపతి అభివృద్ధిని చూపిస్తామని సవాల్ విసిరారు. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జేసీఎస్ నాయకులు మద్దాలి శేఖర్, గ్రీవెన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు ఉదయ్‌వంశీ, అనిల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సూరి, సుభాష్, చంద్, ప్రదీప్, వెంకటేష్ పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న నేతలు



గాంధీ విగ్రహం వద్ద లోకేష్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

దిష్టిబొమ్మ దహనం

ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నారా లోకేష్ దిష్టిబొమ్మను నగరంలోని గాంధీ విగ్రహం వద్ద దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ నగర అధ్యక్షుడు బత్తాల అరుణ్‌యాదవ్ మాట్లాడుతూ తమ నాయకులకు లోకేష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పద్మజ, మనోజ్, పాండురెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో బీసీఎన్ సేవలు భేష్



రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న బీసీఎన్ సంస్థల అధినేత

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చడంలో బీసీఎన్ విద్యాసంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ద్రవిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బీసీఎన్ విద్యాసంస్థలోని కుప్పం పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల కుప్పంలో ఎల్‌కేజీ నుంచి ఇంజినీరింగ్ విద్య వరకు విద్యాసంస్థలు స్థాపించి గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను దగ్గరకు చేర్చిన ఘనత బీసీఎన్ సంస్థల అధినేత బీసీ నాగరాజుకే దక్కుతుందన్నారు. అనంతరం వేణుగోపాల్ రెడ్డిని కాలేజీ యాజమాన్యం సత్కరించింది. బీసీఎన్ సంస్థల అధినేత నాగరాజు, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ సుప్రియ పాల్గొన్నారు.

ప్రాణాలను హరిస్తున్న అతివేగం

నిర్లక్ష్యం..మితిమీరిన వేగం యువత ప్రాణాలను పణంగా పెడుతోంది. ద్విచక్ర వాహనదారులు ఫీట్లు చేస్తూ కనీసం హెల్మెట్లు కూడా ధరించడం లేదు. కార్లలో సీట్‌బెల్టు ధరించేవారే లేరు. కారులో అలెర్ట్‌లు వస్తున్నా యువత పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఉజ్వల భవిషత్తు ఉన్న యువత తల్లిదండ్రులకు విషాదాన్ని నింపి అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు.

- కడప, నెల్లూరు జిల్లాలకు చెందిన వికాష్, ప్రవీణ్, కల్యాణ్ అనే ముగ్గురు విద్యార్థులు తమిళనాడులోని కృష్ణగిరి నుంచి కారులో వేగంగా వస్తూ కుప్పం సమీపంలో శెట్టిపల్లి వద్ద ఆదివారం ఉదయం ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని తెలుస్తోంది.
- మూడేళ్ల కిందట క్రితం పలమనేరులోని మథర్ థెరిసా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న ముగ్గురు, రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.
- రెండ్రోజుల కిందట మండలంలోని మండిపేటకోటూరుకు చెందిన హేమంత్(32) వాహనంలో వస్తూ పుంగనూరు సమీపంలోని గుడిసెబండవద్ద బ్యారికేడ్లను ఢీకొని మృతిచెందాడు. ఇవి ఉదాహరణలు మాత్రమే. అతివేగం కారణంగా జరుగుతున్న ప్రమాదాలు జిల్లాలో గత మూడేళ్లుగా పెరుగుతూనే ఉన్నాయి.

- ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రాణాలు కోల్పోతున్న యువత
- చాలా ప్రమాదాల్లో హెల్మెట్ లేక, సీట్‌బెల్ట్ ధరించకే మృతి
- హైవే నిర్మాణాలతో మరింత పెరిగిన వాహనాల వేగం
- రహదారి నిబంధనలు పట్టించుకోని వైనం



కుప్పం పీఈఎస్ కళాశాల సమీపంలోని శెట్టిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

STAY SAFE
SPEED KILLS - IS IT WORTH THE RISK ?

SPEED	TIME TO GO 25 KM's	TIME SAVED	RISK OF DEATH
80 km/h	12 Min	-	x
88 km/h	10:54 Min	1:6 Min	1.5 x
96 km/h	10 Min	2 Min	2 x
105 km/h	9:14 Min	2:46 Min	3.0 x
112 km/h	8:34 Min	3.26 Min	4.0 x
120 km/h	8 Min	4 Min	6.0 x
128 km/h	7:30 Min	4:30 Min	8 x
136 km/h	7:20 Min	4:57 Min	12 x

ఎంత వేగం వెళ్తాలో తెలియజేసే చార్టు

పలమనేరు: జిల్లాలోని చెన్నై- బెంగళూరు, కృష్ణగిరి-అనంతపురం, చిత్తూరు-నాయుడుపేట హైవేలు నిర్మించాక రోడ్లు చక్కబడ్డాయి. ఈ మార్గాల్లో కార్లలో గరిష్ట వేగం వందకు దాటింది. కొన్ని కంపెనీల కార్లు గంటకు 150 నుంచి 180 దాకా వేగంతో వెళ్లే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం అధిక సామర్థ్యం కలిగిన పలు రకాల బైక్‌లు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రస్తుతం అధిక సామర్థం(సీసీ)గల బైక్‌లు గంటకు 240 కిమీ వేగంతో నడుస్తాయి. బైక్‌లతో యువకులు అతివేగంగా వెళ్లడంతో పాటు ఫీట్లు చేయడం ఫ్యాషన్‌గా మారింది. 25 కిలోమీటర్ల దూరాన్ని కారులో గంటకు 80 కిమీ వేగంతో వెళితే 12 నిమిషాల్లో గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. అదే 136 కిమీ వేగంతో వెళ్తే 7.20 నిమిషాల్లో చేరవచ్చు. ఐదు నిమిషాలు ముందు వెళ్లడం కోసం నిబంధనలు ఉల్లంఘిస్తూ యువత ప్రాణాలను పణంగా పెడుతోంది.

రక్తసిక్తమవుతున్న రహదారులు

రెండేళ్లుగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2021లో 733 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 322 మంది మృతిచెందారు. 805మంది గాయపడ్డారు. 2022లో 711 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 366మంది మృతిచెందారు. 799మంది గాయపడ్డారు. గణాంకాలను బట్టి ఎక్కువగా కార్లు, ఆపై బైక్ ప్రమాదాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రమాదాలు ఎక్కువగా అతివేగం కారణంగానే జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారూ ఎక్కువమంది యువకులే కావడం గమనార్హం.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి రూ.వేలలో అపరాధం వసూలు చేస్తున్నాం. ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో 11,680 ట్రాఫిక్ చలానా కేసులు పరిష్కారం అయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తూనే ఉన్నాం.

– సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ, పలమనేరు

రోడ్లు బాగున్నా వేగంగా పోకూడదు

అతివేగం కారణంగానే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్లు బాగున్నాయని వాహనదారులు మితిమీరిన వేగంగా వెళ్లకూడదు. చాలామంది సీట్‌బెల్టును వేసుకోవడం లేదు. ఏ మాత్రం అనుభవం లేకుండా కనీసం డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేకుండా చాలా మంది వాహనాలు నడుపుతున్నారు. నిబంధనలపై అవగాహన కల్పిస్తూనే ఉన్నాం

– మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు



ఘనంగా 'క్యాండర్' వార్షికోత్సవం

చంద్రగిరి : ఐతేపల్లె సమీపంలోని క్యాండర్ ఇంటర్నేషనల్ పాఠశాల తొలి వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రముఖ విద్యాంసుడు బెన్నీ ప్రసాద్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జమున, ఎస్వీ మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ రామసుబ్బారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందరికీ అందించాలనే లక్ష్యంతో క్యాండర్ పాఠశాల స్థాపించినట్లు తెలిపారు. బెన్నీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను ఒకరితో ఒకరిని పోల్చకూడదని, కళను ఆస్వాదించే స్వాతంత్ర్యం ఇవ్వాలని ఇవ్వాలని సూచించారు. డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ పిల్లలను ఒత్తిడికి గురిచేయకుండా విద్యను అందించాలని కోరారు. ప్రొఫెసర్ జమున మాట్లాడుతూ విద్యార్థులకు విలువలు నేర్పించాలన్నారు. డాక్టర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రిన్సిపల్ ఆకుల నాగశ్వేత వార్షిక నివేదిక అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఎండీ నరేష్ పాల్గొన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బెన్నీ ప్రసాద్, వెంగమ్మను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

అంతర్రాష్ట్ర ఎర్రదొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: ఎర్రావారిపాళెం మండలంలో శనివారం సాయంత్రం చేపట్టిన వాహనాల తనిఖీలో ముగ్గురు అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాకు చెందిన రవికుమార్, సుధాకర్, మణివేల్ మండలంలోని ఎలమంద ఉస్తికాయల పేట రోడ్ వద్ద కారు, మోటార్‌సైకిల్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో సీఐ తులసీరామ్, సిబ్బంది పట్టుకుకోబోయారు. దీంతో వారు హోంగార్డు, కానిస్టేబుల్ పై దాడి చేసి పారిపోయేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి పరారవగా, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు పేరుమోసిన అంతర్రాష్ట్ర స్మగ్లర్లుగా గుర్తించారు. వారి నుంచి 13 ఎర్రచందనం దుంగలు, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

తండ్రిపై కుమారుడి దాడి

- మహిళతో సన్నిహితంగా ఉండవద్దన్నందుకు..
- కొడుతున్న దృశ్యం వీడియోకాల్‌లో ప్రియురాలికి ..



వివరాలు చెబుతున్న క్షతగాత్రుడు ఢిల్లీబాబు

చిత్తూరు అర్బన్: పదో తరగతి చదివే ఇద్దరు పిల్లలున్న ఓ మహిళ మోజులో పడిన 21 ఏళ్ల యువకుడు కన్న తండ్రిపైనే దాడిచేసి తీవ్రంగా గాయపరచాడు. తాను కొడుతున్న దృశ్యాన్ని ప్రియురాలికి వీడియోకాల్ చేసి తండ్రిని చితకబాదాడు. చిత్తూరు నగరంలో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ ఎస్ఐ మల్లికార్జున, బాధితుడి కథనం మేరకు.. ఢిల్లీబాబు అనే వ్యక్తి గాంధీరోడ్డులో కాపురముంటూ హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఇతని కొడుకు భరత్ (21) ఇంట్లో తల్లిదండ్రుల మాట వినకుండా జులాయిగా తిరుగుతున్నాడు. పదో తరగతి చదివే ఇద్దరు పిల్లలు ఉన్న 39 ఏళ్ల ఓ మహిళతో ఇతను సన్నిహితంగా ఉండేవాడు. ఇది నచ్చకపోవడంతో కుమారుడిని పలుమార్లు ఢిల్లీబాబు హెచ్చరించాడు. ఈవిషయమై తండ్రీకొడుకుల మధ్య మనస్పర్థలున్నాయి. ఆదివారం ఇంట్లో భోజనం చేస్తున్న తండ్రి వద్దకు వచ్చిన భరత్.. మహిళకు వీడియోకాల్ చేసి తన తండ్రిని కొడుతున్న దృశ్యం చూడమంటూ ఫోన్ ఆన్‌లోనే ఉంచి దాడి చేశాడు. చింతకట్టెతో తలపై తీవ్రంగా కొట్టడంతో ఢిల్లీబాబుకు రక్తగాయాలయ్యాయి. గాయపడ్డ ఢిల్లీబాబును కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'స్విమ్స్' వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు,నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం స్విమ్స్ 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేషనల్ మెడికల్ కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఎస్ గంగాధర్, టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, జేఈఓ సదా భార్గవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గంగాధర్ మాట్లాడుతూ స్విమ్స్‌లో వైద్యులు, ఫ్యాకల్టీ, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారని ప్రశంసించారు. 30 ఏళ్లుగా క్రమం తప్పకుండా మెడికల్ జర్నల్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. వృత్తి ధర్మం తప్పకుండా సమాజానికి వైద్య సేవలు అందించాలని సూచించారు. టీటీడీ సహకారంతో స్విమ్స్ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈఓ ధర్మారెడ్డి మాట్లాడుతూ టీటీడీ సహకారంతో 1993 ఫిబ్రవరి 26వ తేదీన ప్రారంభమైన స్విమ్స్ అత్యున్నత వైద్యసేవలు అందిస్తోందన్నారు. స్విమ్స్ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జేఈఓ సదా భార్గవి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో రోగులకు విశిష్టమైన సేవలు అందించి దేశంలోనే చక్కటి గుర్తింపుపొందిందని తెలిపారు. డైరెక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ స్విమ్స్ వైద్య విజ్ఞాన సంస్థ దినదినాభివృద్ధి చెందిన తీరును వివరించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా ఆకాంక్ష-2023, వార్షిక నివేదిక-2022 సీడీలు, జర్నల్ ఆఫ్ క్లినికల్ అండ్ సైంటిఫిక్ రీసెర్చ్-2022-23 పుస్తకాలను ఆవిష్కరించారు. వివిధ పోటీలలో గెలుపొంది విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీధర్‌బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వనజాక్షమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

కలకలం రేపిన మహిళ కిడ్నాప్




పార్వతిని లాక్కెళుతున్న కిడ్నాపర్లు, (ఇన్‌సెట్) పార్వతి (ఫైల్)

రేణిగుంట: మండలంలోని తూకివాకం పంచాయతీ ఏఎస్ఆర్ కాలనీలో మహిళ కిడ్నాప్ ఘటన ఆదివారం కలకలం రేపింది. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు... రవిచంద్ర, పార్వతి కుమారుడు నితిన్‌కి శ్రీకాళహస్తి వీఎంపల్లెకు చెందిన మహేశ్వరితో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడిపోయారు. కోర్టు సైతం నితిన్ మరొకరిని వివాహం చేసుకోవచ్చని తీర్పు ఇచ్చింది. దీంతో ఈనెల 7వ తేదీన ఇందు అనే యువతిని నితిన్ పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మహేశ్వరి కుటుంబీకులు, బంధువులు ఆదివారం పక్కా ప్లాన్‌తో ఏఎస్ఆర్ కాలనీలోని నితిన్ ఇంటికి ఆటోలో వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో నితిన్ తల్లి పార్వతి మాత్రమే ఉంది. కూలి మస్తాన్, కూలి రాజమ్మ, కూలి ధనలక్ష్మి, కూలి సాయికుమార్, మరో ఇద్దరు వ్యక్తులు కలసి ఇంట్లోకి చొరబడి టీవీ, ఫ్రిజ్, బీరువా, ఫర్నీచర్, వస్తు సామగ్రిని ధ్వంసం చేశారు. పార్వతిని దుర్భాషలాడుతూ బలవంతంగా ఈడ్చుకుంటూ తీసుకువచ్చి ఆటోలో వేసుకుని తీసుకెళ్లారు. స్థానికులు వారిస్తున్నా పట్టించుకోకుండా కిడ్నాప్ చేశారు. ఈ మేరకు పార్వతి భర్త రవిచంద్ర గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ధర్మారెడ్డి, తమ సిబ్బందితో కలసి శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసుల సహకారంతో కిడ్నాప్‌కు గురైన పార్వతిని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇంతటి దౌర్జన్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీటీసీ, సింగిల్‌విండో డైరెక్టర్ నాగసుబ్రమణ్యంరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన ఏఎస్ఆర్ కాలనీకి చేరుకుని కిడ్నాప్ ఉదంతంపై ఆరా తీశారు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని.. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై చర్చ

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర స్థాయి జాయింట్ కన్వెన్షన్ సమావేశంలో చర్చించినట్లు ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు తెలిపారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ రెగ్యులరైజేషన్, తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సంపులో పడి చిన్నారి మృతి



చార్విక(ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం) : సంపులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం పెనుమూరు మండలం గుత్తావాండ్ల ఊరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. శ్రీరంగరాజపురం మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన పరందామనాయుడు, సుప్రియ దంపతుల ఏకైక కుమార్తె చార్విక(3). వీరు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సుప్రియ పుట్టిల్లు గుత్తావాండ్ల ఊరుకి వచ్చింది. ఈ క్రమంలో చార్విక పిల్లలతో ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న సంపులో పడి పోయింది. తోటి పిల్లలు ఈ విషయాన్ని గుర్తించలేదు. కొద్ది సేపటి తర్వాత చిన్నారి సంపులో మృతి చెంది ఉండగా కుటుంబసభ్యులు గుర్తించారు. గుండెలవిసేల కుటుంబ సభ్యులు విలపించడం చూసి గుత్తావాండ్ల ఊరు సోక సంద్రంగా మారింది.

పేకాట రాయుళ్ల అరెస్టు

యాదమరి: మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెనుక మామిడి తోటలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ. 7,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.7,600 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లపై ప్రశ్నించినందుకు దాడి

చిత్తూరు అర్బన్: చిత్తూరు శివారుల్లోని కుప్పన్నగారిపల్లె వద్ద ఆదివారం జరిగిన గొడవల్లో ఐదుగురు గాయపడ్డారు. పోలీసు కథనం మేరకు.. మురకంబట్టు బైపాస్‌లోని కుప్పన్నగారిపల్లెకు చెందిన వెంకటేష్, చంద్రయ్య స్థానికంగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై అక్కడున్న కొందరిని ప్రశ్నించారు. ఆదివారం ద్విచక్రవాహనంలో వెళుతున్న వెంకటేష్, చంద్రయ్యను కొందరు అడ్డగించి కర్రలతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఇతని బంధువులు ఘటన స్థలానికి వెళ్లగా సుబ్రమణ్యం, చైతన్య, రమేష్ అనే ముగ్గురిపై కూడా దాడి చేశారు. గాయపడిన వారిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.